సాక్షి
జనగామ
సోమవారం । 22 । జనవరి । 2024

## న్యూస్‌రీల్

### పండుగలా జరుపుకోండి



**జనగామ:** అయోధ్య ఆలయ పునఃప్రతిష్ఠాపన నేటితో సాకారమవుతున్న వేళ, రాజకీయాలక తీతంగా ప్రతి ఇంటా పండుగ జరుపుకోవాలని రామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ జిల్లా అధ్యక్షుడు మంచాల రవీందర్ పిలుపునిచ్చారు. ఆదివారం పట్టణంలో జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ సోమవారం ఉదయం ప్రతి ఒక్కరు దేవాలయానికి వెళ్లి సామూహికంగా రామ తారక మంత్రాన్ని 108 సార్లు జపించాలన్నారు. అయోధ్యలో బాల రాముని ప్రాణ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని కనులారా వీక్షించి, స్వామి కృపకు పాత్రులు కావాలన్నారు. ఆరుబయట ఐదు దీపాలను వెలిగించాలని సూచించారు. ఈ సమావేశంలో సంఘ ఉపాధ్యక్షులు దొంతల శేఖర్, గుణిగంటి రామకృష్ణ, బచ్చు బాలనారాయణ, భక్తతుకారం తదితరులు పాల్గొన్నారు.

### రూ.5 లక్షల విరాళం



**జనగామ:** అయోధ్య రామ మందిర పునఃప్రతిష్ఠాపన మహోత్సవానికి జనగామ నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ రామిని హరీష్ రూ.5 లక్షల విరాళం అందించినట్లు సామాజిక సేవా కార్యకర్త వంగ భీమ్‌రాజ్ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ మనం సంపాదిస్తున్న సంపాదనలో సమాజాభివృద్ధి, ఆధ్యాత్మికం, ధర్మం, దేశం కోసం సహాయం చేయడం వల్ల పంచభూతాలు మనం చేసే ప్రతి పనికి తోడుంటాయన్నారు.

### రాష్ట్రపతి విందుకు ఆహ్వానం




**లింగాలఘణపురం:** మండలంలోని నెల్లుట్ల సర్పంచ్ చిట్ల స్వరూపరాణిభూపాల్‌రెడ్డి దంపతులకు ఈనెల 26న గణతంత్ర దినోత్సవం సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఇంట్లో జరిగే విందుకు ఆహ్వానం వచ్చింది. ఈ మేరకు ఆదివారం సర్పంచ్ దంపతులకు పీఆర్‌అండ్‌ఆర్‌ఈ డైరెక్టర్‌ను నుంచి లేఖ అందింది. గత ఏడాది ఏప్రిల్ 17న ఢిల్లీలో జరిగిన పంచాయతీరాజ్ జాతీయ స్థాయి అవార్డుల ప్రదానోత్సవంలో నెల్లుట్ల సర్పంచ్ చిట్ల స్వరూపరాణి «నీటి సంవృద్ధిపై» రాష్ట్రపతి చేతుల మీదుగా జాతీయ ఉత్తమ పంచాయతీ అవార్డును అందుకున్నారు. ఈ నేపథ్యంలో గణతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా సాంప్రదాయబద్ధంగా రాష్ట్రపతి ఇంట్లో జరిగే విందుకు రాష్ట్రం నుంచి వీరికి ఆహ్వానం అందింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇలాంటి అవకాశం రావడం ఆనందంగా ఉందన్నారు.


### ఓటరు నమోదు శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

**జనగామ రూరల్:** రానున్న ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో పట్టభద్రులు ఓటు నమోదు చేసుకోవాలని జిల్లా జాక్ కన్వీనర్ మంగళంపల్లి రాజు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జాక్ ఆధ్వర్యంలో సోమవారం ఉచిత నమోదు శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. జాక్ కార్యాలయంలో క్యాంపు ఏర్పాటు చేశామని నూతనంగా రిజిస్ట్రేషన్ చేసుకునేవారు సంబంధిత ధ్రువీకరణ పత్రాలు తీసుకొని రావాలని కోరారు. మరిన్ని వివరాలకు 8555828081 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

### ధర్నాను విజయవంతం చేయాలి



**పాలకుర్తి టౌన్:** ఈవీఎంలకు వ్యతిరేకంగా ఈ నెల 31న ఢిల్లీలో కేంద్ర ఎన్నికల కమిషనర్ కార్యాలయం ఎదుట జరిగే ధర్నాను విజయవంతం చేయాలని బీఎంఎం రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ నరేందర్ పవార్ అన్నారు. ఆదివారం పాలకుర్తి రాజీవ్ చౌరస్తాలో ధర్నాకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భారత్ ముక్తి మోర్చా (బీఎంఎం) ఆధ్వర్యంలో నిర్వహించే చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈవీఎంల ద్వారా ఎన్నికలు నిర్వహించాలంటే వీవీప్యాట్‌లో పడిన ఓట్లను లెక్కించాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేవరాయ సాయిలు, బహుజన కులాల ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు సాంబయ్య, నాయకులు అశోక్, రాము, యాకయ్య పాల్గొన్నారు.









# ఓరుగల్లులో రాముడి జాడలు

## లక్ష్మణసమేతుడై మన ప్రాంతంలో కాలు మోపినట్లు చరిత్ర

- జింకను కొట్టిన చోటే జీడికల్..
- వల్మిడి రఘురాముడి గుట్ట మీద పూర్వం వాల్మీకి ఆశ్రమం

**హన్మకొండ కల్చరల్ :**

భారతీయ సనాతన ధర్మానికి.. నైతిక విలువలకు నిలువెత్తు నిదర్శనం శ్రీరామచంద్రుడు. ఆదర్శ పురుషుడు.. శ్రీసీతారామచంద్రస్వామి లక్ష్మణసమేతుడై ఓరుగల్లులో కాలు మోపినట్లు స్థానిక కథల ద్వారా అవగతమవుతోంది. శ్రీరాముడు సీతాలక్ష్మణులతో కలిసి గోదావరి నదిని దాటి దక్షిణదేశం వెళ్లినట్లు తెలుస్తోంది. 1970 దశకంలో చాలా మంది రచయితలు, పరిశోధకులు ఈ విషయాన్ని ప్రస్తావించారు. అయితే నేటిమాదిరిగానే ఆ కాలంలోనూ ఉత్తర భారతదేశానికి చెందిన వారు దక్షిణదేశం వైపు వెళ్లాలంటే కరీంనగర్–వరంగల్ సరిహద్దులోని గోదావరి నదిని దాటాల్సి వచ్చేదని ప్రాచీన రహదారుల చరిత్రను చూస్తే అర్థమవుతోంది. ఆ విధంగా శ్రీరాముడు దక్షిణభారతదేశం వెళ్తున్న క్రమంలో ఈ ప్రాంతం నుంచి ప్రయాణం సాగించినట్లు తెలుస్తోంది. కరీంనగర్‌లోని రామగిరి ఖిల్లా, గుంపుల, ఇల్లందకుంట, జనగామ జిల్లాలోని జీడికల్ రామాలయం, ఖమ్మంలోని భద్రాచల పుణ్యక్షేత్రం ఈ విధంగానే ప్రసిద్ధమయ్యాయి. నేడు అయోధ్య రామాలయంలో బాలరాముడి ప్రాణప్రతిష్ఠ కార్యక్రమం నేపథ్యంలో ప్రత్యేక కథనం.

### నేడు శ్రీరామ స్తోత్రపారాయణం

అయోధ్యలో బాలరాముడి ప్రాణప్రతిష్ఠ నేపథ్యంలో హనుమకొండ వికాస్‌నగర్‌లోని శ్రీగోదామాధవ ఆధ్యాత్మిక ప్రచార కేంద్రంలో సోమవారం ఉదయం 6 నుంచి సాయంత్రం వరకు ఆపదుద్ధారక స్తోత్రపారాయణం చేయనున్నట్లు నిర్వాహకులు శ్రీఆరుట్ల శ్రీనివాసాచార్యస్వామి తెలిపారు. అలాగే శ్రీరాముడికి ప్రత్యేక పూజలు చేయనున్నట్లు పేర్కొన్నారు.

**తెలుగు నేలపై మొదటిఅడుగు..**

దండకారణ్యంలోని ఆదిలాబాద్ మీదుగా తెలుగు నేలపై అడుగుపెట్టిన శ్రీరాముడు.. కరీంనగర్‌లోని ప్రస్తుత రామగిరిఖిల్లా ప్రాంతంలో చాలా కాలం ఉన్నట్లు చరిత్రకారుల రచనల ద్వారా తెలుస్తోంది. అక్కడి నుంచి ప్రయాణిస్తూ గుంపుల వద్ద విశ్రాంతి తీసుకున్న క్రమంలో అక్కడి రజకులు బట్టలు ఉతుకుతుండగా వచ్చే శబ్దాలకు నిద్రాభంగం కలిగి జమ్మికుంట మండలంలోని ఇల్లందకుంటకు చేరినారట. రామగిరి ఖిల్లా, గుంపులలోనూ శ్రీరాముని పాదముద్రలు ఇప్పటికీ పూజింపబడుతున్నాయి. రాముడు ఇక్కడ ఉన్నప్పుడే తండ్రి దశరథుడి మరణవార్త తెలియగా.. శ్రీరామలక్ష్మణులు ఇల్లందకుంటలో చెట్టు పలుకులతోనే తండ్రికి శ్రాద్ధ కర్మలు చేశారట. ఈ చెట్టు ఇప్పటికీ కన్పిస్తుంది. ఈ చెట్టు కిందనే శ్రీసీతారామచంద్రస్వామి స్వయంభువుగా నిలిచాడని ప్రజల నమ్మిక.

### వాల్మీకి ఆశ్రమమే వల్మిడి

ప్రస్తుత జనగామ జిల్లా పాలకుర్తి మండల పరిధి వల్మిడి గ్రామం వరంగల్ నుంచి 58 కిలోమీటర్ల దూరంలో పాలకుర్తి నుంచి కొడకండ్లకు వెళ్లే దారిలో ఉంది. వల్మిడిలోని రఘురాముడి గుట్ట మీద పూర్వం వాల్మీకి ఆశ్రమం ఉండేదనీ.. నేటికీ వాల్మీకి నివాసమున్న గుహను చూపిస్తుంటారు. గుట్టకు నైరుతిభాగంలో ఆంజనేయస్వామి విగ్రహం ఉంది. అలాగే గుట్టపైన రామాలయంలో పూర్వం అతిపెద్ద పంచలోహ విగ్రహాలు ఉండగా.. దొంగలు ఎత్తుకుపోయారట. పూర్వం ఇక్కడ రామటంకలు(నాణేలు) దొరికాయని, రాముడు ఈ ప్రాంతంలో సంచరించారని ప్రజలు విశ్వసిస్తారు. ఈ దేవాలయం భద్రాచలం రామాలయం కంటే పురాతనమైనదని భక్తులు భావిస్తారు. గత సంవత్సరం రాముడి దేవాలయాన్ని పునర్నిర్మించి శ్రీచినజీయర్ స్వామి చేతుల మీదుగా 2023 సెప్టెంబర్ 4న విగ్రహాల ప్రతిష్ఠాపన చేశారు.

### జింకను కొట్టిన చోటే జీడికల్..



శ్రీ రాముడు వనవాసకాలంలో మాయ లేడిని తరుముకుంటూ వచ్చి ఈ ప్రాంతంలోనే సంహరించాడట. ప్రస్తుత జనగామ జిల్లా లింగాలఘణపురం మండలం జీడికల్ గ్రామానికి మైలు దూరంలో గుట్టపై దేవాలయం ఉంది. ఈ గుట్టపైనే పాలగుండం, జీడిగుండం అనే రెండు కొలనులు, లేడిబండ లేదా జింకబండ అనే రాయి ఉంది. ఈ రాయినే వీరాచలం అని అంటారు. శ్రీరాముడు సీతాదేవి కోరిక మేరకు మాయ లేడిని తరుముకుంటూ వచ్చి పట్టుకోలేక చంపడానికి బాణం ఎక్కుపెడతాడు. ఆదే సమయంలో మాయ లేడి వణికిపోయి శ్రీ రాముడ్ని శరణు కోరుతుంది. అప్పటికే సాయంత్రం కావడంతో శ్రీరాముడు తిరిగి వస్తుంటాడు. దారిలో దాహం వేస్తుంది. అలాగే సంధ్యావందన సమయం కావడంతో శ్రీరాముడు గంగాదేవిని ప్రార్థించి బొటన వేలితో భూమిని నొక్కగానే నీటి ఊట వస్తుంది. ఆ నీటితో శ్రీరాముడు సంధ్యావందనాది పూజలు పూర్తి చేస్తాడు. అదే సమయంలో పక్కనే ఉన్న బండపై ఒక కొలను.. దాని ఒడ్డునున్న రేగు వృక్షం కింద వీరా అనే ముని తపస్సు చేసుకుంటూ కనిపిస్తే శ్రీరాముడు అతడి భక్తికి మెచ్చి గంధపు చెక్కలతో చేసిన తన పాదుకలను మునికి ఇచ్చాడట. భక్తులు ఇప్పటికీ జీడిగుండం నీళ్లతో స్నానం చేసి పాలగుండంలో నీళ్లను తలపై చల్లుకుంటారు. ఇక్కడ శ్రీరామనవమి రోజు కాకుండా కార్తీకపౌర్ణమి నుంచి బహుళ ద్వాదశి వరకు ఉత్సవాలు నిర్వహించి శ్రీసీతారామచంద్రస్వామి కల్యాణోత్సవం వైభవంగా నిర్వహిస్తారు.

### అయోధ్య.. ఆధ్యాత్మిక జగత్తు



పురుషోత్తముడైన శ్రీరామచంద్రుడు ఓటమి ఎరుగని ధీరోత్తముడు. అయోధ్య.. ఆధ్యాత్మిక జగత్తు. ఆ శ్రీరాముడు తన అవతారాన్ని ముగించాక అయోధ్యవాసులందరూ ఆధ్యాత్మికలోకానికి తిరిగి వెళ్లారని శాస్త్రాలు చెబుతున్నాయి. శ్రీరాముడి దివ్యలీలల్లో భాగస్వాములైన వారందరూ ఆయన అనుగ్రహానికి పాత్రులయ్యారు. అయోధ్యకు ఎవరు వెళ్లినా.. శ్రీరాముడి మూర్తిని దర్శించినా.. ఆయన దివ్య నామాన్ని జపించినా.. భగవంతుడి ప్రత్యక్షానుభూతిని పొందుతారు.

– గంగు ఉపేంద్రశర్మ, ప్రధానార్చకుడు, వేయిస్తంభాల దేవాలయం, హనుమకొండ

### భారతీయుల పండుగ..



ధర్మం మూర్తీభవించిన స్వరూపం శ్రీరామచంద్రుడు. రాముడి గొప్పదనాన్ని పిల్లలకు తెలియజేయాలి. 500 సంవత్సరాలుగా ధర్మపోరాటం చేసి సాధించుకున్న భవ్యమైన శ్రీరామమందిర ప్రారంభం, బాలరాముడి ప్రాణప్రతిష్ఠ భారతీయులకు పండుగ. ఇది శుభపరిణామం. ప్రతి ఒక్కరూ ఈ పండుగరోజున శ్రీరామస్మరణ చేయాలి. అలాగే ఆపదుద్ధారక స్తోత్రపారాయణం చేయడం వల్ల సకల శుభాలు కలుగుతాయి.

– ఆరుట్ల శ్రీనివాసాచార్యస్వామి, ఆధ్యాత్మిక ప్రవచకులు, వికాస్‌నగర్, హనుమకొండ

### శ్రీరామ పాదాభివందనం



ఇంత సంబరమ్మిదియేమి? ఈశ్వరుండు/రామమూర్తియైదిగివచ్చే రమ్యబుద్ధి/ దయయు సత్యమ్ము ధర్మమ్ముతలపులందు / వెలుగ జేసిన మాస్వామి వెలుగుమూర్తి/ ఎన్ని కష్టాలు ఇక్కట్టులిపుడు నరులకున్న / ఈ వేళ పండుగై గోపబాలకులకు / కృష్ణుడుగావచ్చి కోరికలను / తీర్చినట్లు రాముడు మనల దిద్ది తీర్చు / పావనంబైన శ్రీరామపాదములను/పద్యపాదాల పట్టుక పరవశింతు/ సర్వ వాఙ్మయ జీవుల సత్యశోధ/ సాగ గోరెదనాయెద సాధుమతిని.

– పాతూరి రఘురామయ్య, పద్యకవి, రిటైర్డ్ తెలుగు ఉపాధ్యాయుడు, ప్రకాష్‌రెడ్డిపేట, హనుమకొండ

## ఓటరు నమోదును వేగవంతం చేయాలి

- కలెక్టర్ శివలింగయ్య

**జనగామ రూరల్:** క్షేత్రస్థాయిలో నిర్వహిస్తున్న ఓటర్ల నమోదు ప్రక్రియ వేగవంతం చేయాలని కలెక్టర్ సీహెచ్ శివలింగయ్య అధికారులను ఆదేశించారు. ఆదివారం పట్టణంలోని గీతానగర్‌లోని ఏబీవీ ఉన్నత పాఠశాల, మండలంలోని వడ్లకొండ ఉన్నత పాఠశాలను అదనపు కలెక్టర్ పింకేష్‌కుమార్‌తో కలిసి పరిశీలించారు. అనంతరం అధికారులకు, ఆశ కార్యకర్తలకు పలు సూచనలు చేశారు. ఓటరు నమోదు ప్రక్రియలో నకిలీ ఓటర్లను గుర్తించి జాబితా నుంచి తొలగించాలన్నారు. అలాగే ఓటర్ల జాబితాను పరిశీలించారు. కొత్త ఓటరు నమోదులో తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ మురళీకృష్ణ, తహసీల్దార్ వెంకన్న తదితరులు పాల్గొన్నారు.



సూచనలు చేస్తున్న కలెక్టర్ శివలింగయ్య

**ఓటరు నమోదు పరిశీలన**

**పాలకుర్తి:** ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులు, పోలింగ్ స్టేషన్ పనులను స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సుభాషిణి పరిశీలించారు. ఆదివారం పలు పోలింగ్ స్టేషన్లలో జరిగే నమోదు కార్యక్రమాన్ని ఆర్‌ఓతో కలిసి పరిశీలించారు. నూతన ఓటర్ల నమోదుపై సిబ్బందికి సలహాలను సలహాలను అందించారు. తహసీల్దార్ వెంకటేశం, సిబ్బంది ఉన్నారు.

## విద్యావైజ్ఞానిక సభలను విజయవంతంచేయాలి

**విద్యారణ్యపురి:** టీపీటీఎఫ్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 11, 12 తేదీల్లో ఖమ్మం జిల్లాలో నిర్వహించే రాష్ట్రస్థాయి ద్వితీయ విద్యావైజ్ఞానిక మహాసభలను విజయవంతం చేయాలని రాష్ట్ర ఉపాధ్యక్షుడు నన్నెబోయిన తిరుపతి పిలుపునిచ్చారు. ఆదివారం హనుమకొండ కలెక్టరేట్ వద్ద మహాసభలకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి రావుల రమేష్, హనుమకొండ జిల్లా అధ్యక్షుడు ఎం.రఘుపతి, జిల్లా ప్రధాన కార్యదర్శి గొడిశాల సత్యనారాయణ, బాధ్యులు నటరాజ్, సుబ్బారావు, చంద్రగిరి లక్ష్మయ్య, కుమారస్వామి, శ్రీదేవి,ముకుందరెడ్డి, శ్రీనివాస్, రమేష్,అన్నారెడ్డి, రాజు, పి.రమేష్, బి.చక్రునాయక్, రాజేంద్రం పాల్గొన్నారు.



మహాసభల పోస్టర్లు ఆవిష్కరిస్తున్న టీపీటీఎఫ్ బాధ్యులు

## ‘వేం’కు సముచిత స్థానం

- ప్రభుత్వ సలహాదారుగా నరేందర్‌రెడ్డి నియామకం
- కాంగ్రెస్ శ్రేణుల హర్షం



వేం నరేందర్ రెడ్డి

**మహబూబాబాద్ రూరల్:** మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం అర్పనపల్లికి చెందిన టీపీసీసీ ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే వేం నరేందర్ రెడ్డికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సముచిత స్థానం కల్పించింది. సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు నరేందర్‌రెడ్డిని ప్రభుత్వ సలహాదారుగా(క్యాబినెట్ హోదా) నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. 2002లో తెలుగుదేశం తరఫున నల్లబెల్లి జెడ్పీటీసీగా పోటీ చేసి ఓడిపోయిన వేం నరేందర్‌రెడ్డి.. 2004 శాసనసభ ఎన్నికల్లో మహబూబాబాద్ ఎమ్మెల్యేగా ఎన్నికైన నియోజకవర్గ అభివృద్ధితో పాటు అనేక కార్యక్రమాలతో ప్రత్యేక గుర్తింపు పొందారు. 2009 సంవత్సరం పునర్విభజనలో భాగంగా మహబూబాబాద్ స్థానం గిరిజనులకు కేటాయించడంతో నరేందర్‌రెడ్డికి అవకాశం లేకుండా పోయింది. అయినా రాజకీయాల్లో కొనసాగుతూ నాయకులు, కార్యకర్తలకు అందుబాటులో ఉన్నారు. నరేందర్ రెడ్డి ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో రేవంత్ రెడ్డి శాసనమండలి సభ్యుడిగా ఎంపికయ్యారు. అప్పటి నుంచి వారిద్దరి మధ్య స్నేహబంధం పెరిగింది. 2015లో శాసన మండలి సభ్యుడిగా ఎమ్మెల్యేల కోటాలో పోటీ చేసిన నరేందర్ రెడ్డి ఓటమి పాలయ్యారు. ఆ తర్వాత కాంగ్రెస్‌లో చేరి పార్టీ అభివృద్ధికి తీవ్రంగా కృషి చేశారు. మొన్నటి శాసనసభ ఎన్నికల్లో టీపీసీసీ చీఫ్, సీఎం రేవంత్‌రెడ్డికి అత్యంత సన్నిహితంగా ఉంటూ శాసనసభ ఎన్నికల ప్రచారం, నియోజకవర్గ సమావేశాల్లో కీలకంగా వ్యవహరించారు. ఈ నేపథ్యంలో ఆయనను రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుగా నియమించడంపై కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మిత్రులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలియజేశారు.

# ముగిసిన టెక్నోజియాన్-24

- ఉత్సాహంగా పాల్గొన్న విద్యార్థులు
- ప్రత్యేక ఆకర్షణగా ఇస్రో సైంటిస్ట్ ఇంటరాక్షన్

**కాజీపేట అర్బన్:** నిట్ వరంగల్‌లో విద్యార్థులే నిర్వాహకులుగా మూడు రోజులపాటు నిర్వహించిన సాంకేతిక సంబురం టెక్నోజియాన్–24 ఇంజినియస్ ఆదివారం అట్టహాసంగా ముగిసింది. చివరి రోజు స్పాట్‌లైట్స్ ఈవెంట్స్‌లో భాగంగా జహాజ్, ఆర్సీ బగ్గీ, వరంగల్ ట్రేడింగ్ రింగ్, మెకానికల్ కిట్ అసెంబ్లీ ఈవెంట్స్‌లలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. సైంటిస్టులుగా రాణించే స్ఫూర్తినిచ్చిన ఇస్రో సైంటిస్ట్ సురేష్‌కుమార్ ఇంటరాక్షన్ విత్ స్టూడెంట్స్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.




తిరుగుపయనమైన విద్యార్థులు

### హై ఫ్లైయింగ్ జహాజ్..



స్పాట్‌లైట్స్ ఈవెంట్స్‌లో.. నదిలో పడవ దూసుకుపోయిన విధంగా ఏర్పాటు చేసిన హై ఫ్లైయింగ్ జహాజ్ పోటీల్లో నిట్ వరంగల్ విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. నిట్ మేయిన్ బిల్డింగ్ ఎదుట ఉన్న టైమ్‌స్క్వేర్ ప్లాజా ఆవరణలోని ఫౌంటెయిన్ నీటిలో సెన్సార్‌తో నడిచే పడవలను రిమోట్ కారుతో నడిపిస్తూ పోటీపడ్డారు.

### ఆర్సీ బగ్గీ



సీసీ, మెటల్, మట్టి.. ఏ రోడ్డయినా ప్రయాణానికి రెడీ.. గమ్యానికి చేరుతా అంటూ నిట్ వరంగల్ విద్యార్థులు ఆర్సీ బగ్గీ రోబో కంట్రోల్ కారును రూపొందించారు. సెన్సార్‌తో తయారు చేసిన కారును సెల్‌ఫోన్ రిమోట్ కంట్రోల్‌తో నడిపించారు. ఇది ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

### మెకానికల్ అసెంబ్లింగ్ కిట్




వస్తువు ఏదైనా విడదీసేయ్.. అతికించేస్తాం అంటూ నిట్ మెకానికల్ విద్యార్థులు ‘మెకానికల్ అసెంబ్లింగ్ కిట్’లో పాల్గొన్నారు. విడదీసిన వివిధ రకాల వస్తువులను తిరిగి యథాస్థితిలో అతికించి అసెంబ్లింగ్ అంటే ఇది అంటూ పోటీ పడ్డారు.

### నిట్ వరంగల్ నుంచి ఇస్రోకు..

**డాక్టర్ టీఎన్.సురేష్‌కుమార్, ఇస్రో సైంటిస్ట్**

ప్రపంచ స్థాయి ప్రఖ్యాతిగాంచిన నిట్ వరంగల్‌లో విద్యనభ్యసించే అవకాశం రావడమే అదృష్టం. ఇక్కడి నుంచి ఇస్రోకు రావాలని ఇస్రో సైంటిస్ట్ డాక్టర్ టీఎస్.సురేష్‌కుమార్ ఆకాంక్షించారు. టెక్నోజియాన్ ముగింపు సందర్భంగా గెస్ట్‌లెక్చర్‌లో పాల్గొన్న ఆయన విద్యార్థులతో ఇంటరాక్ట్ అయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులు అడిగి పలు ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చారు.

**ఇస్రోకు రావాలంటే మార్గదర్శకత్వం ఎలా...?**

నిట్ వరంగల్‌లో చేపడుతున్న పరిశోధనలను విద్య పూర్తి చేయడంతో ఆపేయకూడదు. జాబ్‌లో జాయిన్ అవగానే మీ బాధ్యత, భవిష్యత్ అయిపోదు. నిరంతరం పరిశోధనలు చేపట్టడం ద్వారా మీకు మీరే మార్గనిర్దేశం చేసుకుంటూ వెళ్తే ఇస్రోకు చేరుకునే అవకాశం ఉంటుంది.



మాట్లాడుతున్న ఇస్రో సైంటిస్ట్ సురేష్‌కుమార్

**సైంటిస్టుగా రాణించాలంటే ఎలాంటి విద్యనభ్యసించాలి..?**

సైంటిస్టులుగా రాణించాలంటే నిట్ వరంగల్‌లో చదివిన విద్యార్థులు అర్హులే. ఇక్కడి రోబోటిక్ క్లబ్‌లో చేపడుతున్న హర్డిల్ మానియా, పింగ్ పాంచ్ లాంచర్, 3డీ ప్రింటింగ్, మెకానికల్ విభాగంలో రూపొందించిన స్పార్థక్ టీం ఆల్ టరేన్ వెహికిల్ మీకు తెలియకుండా ఓ సైంటిస్టులుగా చేపట్టిన పరిశోధనలే. ఇస్రో చేపడుతున్న పలు పరిశోధనలపై ఆసక్తి పెంచుకుంటే సైంటిస్టులుగా రాణించే అవకాశం ఉంటుంది.

**ఇస్రో రాబోవు పరిశోధనలు ఏమిటి..?**

ఇస్రో శాస్త్రవేత్తలుగా ఇప్పటికే చంద్రయాన్, మంగళ్‌యాన్, ఆదిత్యయాన్‌లో ప్రవేశించాం. త్వరలో గగన్ యాన్‌లో ప్రవేశించేందుకు పరిశోధనలు చేపడుతున్నాం. స్పేస్‌లో ఆక్సిజన్‌లేని గగన్ యాన్‌లో ఒక్కసారిగా అడుగుపెట్టామంటే చాలు ఇస్రో నూతన చరిత్రకు శ్రీకారం చుడుతుంది. అబ్దుల్ కలాం స్ఫూర్తితో నిత్యం పరిశోధనలతో ప్రతీ ఒక్కరు చరిత్ర సృష్టించాలి. సమాజానికి తోడ్పడే పరిశోధనలతో యువ సైంటిస్టులుగా నిట్ విద్యార్థులు రాణించాలి.

### 28న ఖోఖో ఎంపికలు

**వరంగల్ స్పోర్ట్స్:** ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి ఖోఖో ఎంపిక పోటీలు ఈనెల 28న నిర్వహిస్తున్నట్లు ఖోఖో సంఘం జిల్లా కార్యదర్శి టి.శ్యాం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు ఆదివారం ఉదయం 9 గంటలకు హనుమకొండ జేఎన్ఎస్‌లోని ఖోఖో గ్రౌండ్ వద్ద హాజరు కావాలన్నారు.

### 30 నుంచి కేయూ బీటెక్ మొదటి సెమిస్టర్ పరీక్షలు

**కేయూ క్యాంపస్:** కాకతీయ యూనివర్సిటీ పరిధిలో బీటెక్(సీబీసీఎస్) మొదటి సంవత్సరం మొదటిసెమిస్టర్ పరీక్షలు(రెగ్యులర్, సప్లిమెంటరీ) ఈనెల 30 నుంచి నిర్వహిస్తున్నట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి పి.మల్లారెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ రాధిక తెలిపారు. 30న మ్యాథ్‌మెటిక్స్–1, ఫిబ్రవరి 1న బేసిక్ ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్/ఇంగ్లిష్, 3న ఫిజిక్స్/కెమిస్ట్రీ, 6న ఇంజనీరింగ్ మెకానిక్స్/ప్రోగ్రామింగ్ ఫర్ ప్రాబ్లమ్ సాల్వింగ్, 8న ఇంజనీరింగ్ గ్రాఫిక్స్ అండ్ డిజైన్ సబ్జెక్టు పరీక్షలు ఉంటాయన్నారు. మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు పరీక్షలు ఉంటాయన్నారు.

# మేడారం..భక్తజనసంద్రం



**తల్లుల సన్నిధికి పోటెత్తిన భక్తులు**
- లక్షకుపైగా మంది హాజరు
- బారులు దీరిన వాహనాలు

**ఎస్ఎస్‌తాడ్వాయి:** మేడారం.. భక్తజనసంద్రమైంది. సమ్మక్క– సారలమ్మల దర్శనానికి భక్తులు భారీగా పోటెత్తారు. ఆదివారం కావడంతో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి నుంచి సుమారు లక్షకు పైగా మంది మేడారానికి తరలివచ్చారు. జంపన్నవాగులో పుణ్యస్నానాలు ఆచరించి దేవతలను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. తల్లులను తలచి.. కొలిచి తన్మయత్వం పొందారు. తల్లుల గద్దెల వద్ద నిలువెత్తు బంగారం సమర్పించి తనివితీరా మొక్కులు చెల్లించుకున్నారు. దీంతో భక్తుల తాకిడితో మేడారం హోరెత్తింది. రద్దీ పెరగడంతో అధికారులు సమ్మక్క ప్రధాన ద్వారం మూసివేశారు. క్యూలైన్ల ద్వారా గద్దెల వద్దకు పంపించారు. అలాగే, కొద్దిసేపు సమ్మక్క, సారలమ్మ గద్దెలపైకి అనుమతించలేదు. దీంతో భక్తులు గ్రిల్స్ బయట నుంచి అమ్మవార్లకు మొక్కులు చెల్లించుకున్నారు. కొద్ది గంటల తర్వాత క్రమపద్ధతిలో గద్దెలపైకి పంపించారు. ఈఓ రాజేంద్రం భక్తుల రద్దీని పర్యవేక్షించారు. పోలీసులు గద్దెల వద్ద భక్తుల రద్దీ నియంత్రణకు శ్రమించాల్సి వచ్చింది.

**వనమంత జనం..**

మేడారం జాతరకు ఇంకా 30 రోజుల సమయం ఉంది. ఈ నేపథ్యంలో సంక్రాంతి పండుగ నుంచే మేడారానికి భక్తుల తాకిడి పెరిగింది. ఆదివారం భక్తుల రద్దీతో మేడారంలో పండుగ వాతావరణం కనిపించింది. మొక్కులు అనంతరం భక్తులు జాతర పరిసర ప్రాంతాల్లో విడిది చేశారు. జంపన్న వాగు నుంచి మొదలు.. నార్లాపూర్, చింతల్, వెంగ్లాపూర్ వరకు సుమారు పది కిలోమీటర్లు, మేడారం ఆర్టీసీ బస్టాండ్ నుంచి తాడ్వాయికి వచ్చే దారిలో ఐదు కిలోమీటర్ల మేర అడవిలో చెట్ల కింద వంటావార్పు చేసుకుని సహపంక్తి భోజనాలు చేశారు.


మేడారం సమ్మక్క, సారలమ్మ గద్దెల ప్రాంగణంలో కిక్కిరిసిన భక్తులు

**వాహనాల ట్రాఫిక్ జామ్.. క్లియర్**

మేడారం దారులన్నీ వాహనాలతో బారులుదీరి కనిపించాయి. పస్రా నుంచి మేడారానికి, కాటారం మీదుగా కాల్వపల్లి నుంచి మేడారానికి ప్రైవేటు వాహనాల్లో భక్తులు తరలివచ్చారు. ఒక్కసారిగా వాహనాల తాకిడి పెరగడంతో నార్లాపూర్ నుంచి జంపన్నవాగు వరకు, జంపన్నవాగు నుంచి మేడారం నీడ చెట్ల వరకు వాహనాలతో ట్రాఫిక్ జామ్ అయింది. దీంతో పోలీసులు ట్రాఫిక్ జామ్ క్లియర్ చేసి వాహనాలను దారి మళ్లించారు. మేడారం ఐలాండ్ వరకు భక్తుల వాహనాలను రాకుండా ఎక్కడిక్కడ చెక్ పోస్టులను ఏర్పాటు చేసి చర్యలు తీసుకున్నారు. ట్రాఫిక్ జామ్ కావడంతో పోలీసులు శ్రమించి ట్రాఫిక్‌ను క్లియర్ చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. జంపన్నవాగు, మేడారం, చిలకలగుట్టు, రెడ్డిగూడెం, ఆర్టీసీ బస్టాండ్ నుంచి తాడ్వాయి ఐదు కిలోమీటర్ల వరకు వాహనాలు రోడ్ల వెంట బారులు దీరాయి.


గద్దెల ప్రాంగణంలో కిక్కిరిసిన భక్తులు


యాటతో మొక్కుతున్న భక్తులు


జంపన్నవాగు వద్ద భక్తుల స్నానాలు

## క్లుప్తంగా

### విద్యార్థి ఆత్మహత్య


అభిలాష్ (ఫైల్)

**రేగొండ:** ఓ విద్యార్థి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన ఆదివారం మండలంలోని రూపిరెడ్డిపల్లిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన శ్రీరామ్ అభిలాష్(15) రుక్మాపూర్ సైనిక్ స్కూల్‌లో పదో తరగతి చదువుతున్నాడు. ఈ క్రమంలో సంక్రాంతి సెలవుల అనంతరం స్కూల్‌కు వెళ్లడం ఇష్టం లేక ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటనపై మృతుడి తల్లి శిరీష ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రవికుమార్ తెలిపారు.

### చికిత్స పొందుతూ వ్యక్తి మృతి..


మురళి (ఫైల్)

**రేగొండ:** భార్య కాపురానికి రావడం లేదని మనస్తాపానికి గురైన ఓ వ్యక్తి.. ఆత్మహత్యకు యత్నించి చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని పెద్దంపల్లిలో చోటుచేసుకుంది. చిట్యాల మండల కేంద్రానికి చెందిన బండి మురళి(28)కి రేగొండ మండలం పెద్దంపల్లి గ్రామానికి చెందిన మౌనికతో వివాహమైంది. మురళి తరుచూ మద్యం సేవిస్తుండడంతో ఇద్దరి మధ్య నెలరోజుల క్రితం స్వల్ప ఘర్షణ జరిగింది. దీంతో మౌనిక పుట్టింటికి వెళ్లింది. భార్య కాపురానికి రావడం లేదని మనస్తాపానికి గురైన మురళి.. శనివారం మధ్యాహ్నం రేగొండ తహసీల్ కార్యాలయం సమీపంలో పురుగుల మందు తాగాడు. గమనించిన గ్రామస్తులు 108లో ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం మృతి చెందాడు. ఈ ఘటనపై మృతుడి తల్లి బండి వనమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రవికుమార్ తెలిపారు.

### ఆర్టీసీ బస్సు ఢీ.. వ్యక్తి దుర్మరణం


ఘటనా స్థలిలో మరణించిన శ్రీనివాస్

**రఘునాథపల్లి:** ఆర్టీసీ బస్సు ఢీ కొనడంతో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన ఆదివారం రాత్రి మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. హనుమకొండ జిల్లా ఐనవోలు మండల కేంద్రానికి చెందిన అలుగునూరి శ్రీనివాస్ (32) పని నిమిత్తం రఘునాథపల్లికి వచ్చాడు. ఆర్‌వీఎస్ ఎదుట హైవే దాటుతున్నాడు. ఈ క్రమంలో హైదరాబాద్ నుంచి హనుమకొండ వైపునకు వెళుతున్న వరంగల్–1 డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ఢీకొంది. దీంతో తీవ్ర గాయాలైన శ్రీనివాస్ అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న ఎస్సై రఘుపతి ఘటనా స్థలిని పరిశీలించి మృతదేహాన్ని జనగామ ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.




### కారు, ద్విచక్రవాహనం ఢీ

- భర్త మృతి, భార్యకు తీవ్రగాయాలు
- అంబాల శివారులో రోడ్డు ప్రమాదం


రవి మృతదేహం

**కమలాపూర్ :** కమలాపూర్ మండలం అంబాల శివారులో ఆదివారం కారు, ద్విచక్ర వాహనం ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో మంచిర్యాల జిల్లా మందమర్రి మండలం రామకృష్ణాపురానికి చెందిన బోయిని రవి (50) మృతి చెందగా, ఆయన భార్య లత తీవ్రంగా గాయపడింది. పోలీసుల కథనం ప్రకారం రవి తన భార్య లతతో కలిసి ద్విచక్రవాహనంపై రామకృష్ణాపురం నుంచి హనుమకొండకు చేరుకుని బంధువులను ఆస్పత్రిలో పరామర్శించారు. అనంతరం హనుమకొండ నుంచి బయలుదేరి కమలాపూర్ మండలం గుండెడులోని తమ బంధువుల ఇంటికి వస్తున్నారు. ఈ క్రమంలో అంబాల శివారులో ఎదురుగా వస్తున్న కారు.. ద్విచక్రవాహనాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో రవి, ఆయన భార్య లతకు తీవ్రగాయాలయ్యాయి. వెంటనే 108లో వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందతూ రవి మృతి చెందగా.. లతను మెరుగైన వైద్యం కోసం ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమె పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. ఈ ఘటనపై మృతుడి సోదరుడు శ్రీను ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ వీరస్వామి తెలిపారు.

### కారు, బస్సు ఢీ..

- ప్రయాణికులకు స్వల్ప గాయాలు
- మామునూరు శివారులో ఘటన

**మామునూరు:** వరంగల్–ఖమ్మం జాతీయ రహదారిపై కారు.. ఆర్టీసీ బస్సును ఢీకొంది. ఈ ఘటన ఆదివారం రాత్రి ఖిలా వరంగల్ మండలం మామునూరు శివారులో జరిగింది. ప్రయాణికుల కథనం ప్రకారం.. వరంగల్ నుంచి ఖమ్మం వైపునకు వెళ్తున్న ఆర్టీసీ బస్సును ఖమ్మం నుంచి వరంగల్ వైపునకు వెళ్తున్న కారు ఢీకొని ముందుకు వెళ్లి ఆగిపోయింది. కాగా, కారులో బెలూన్స్ ఓపెన్ కావడంతో అందులో ఉన్న వారికి స్వల్ప గాయాలయ్యాయి. బస్సులో ఒక్కరిద్దరికి కూడా స్వల్ప గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న ఎస్సై కృష్ణవేణి హుటాహుటిన ఘటనా స్థలికి చేరుకున్నారు. రోడ్డుపై నిలిచిన ఆర్టీసీ బస్సు, కారును వెంటనే తొలిగించి ట్రాఫిక్ క్లియర్ చేశారు.

# సేవాలాల్ జయంతిని సెలవుగా ప్రకటించాలి


అభివాదం చేస్తున్న బంజారా సంఘాల నాయకులు

**హన్మకొండ:** సేవాలాల్ జయంతిని ప్రభుత్వం సెలవుదినంగా ప్రకటించాలని ఏటూరు నాగారం స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ డీఎస్ వెంకన్న నాయక్ , రిటైర్డ్ చీఫ్ ఇంజనీర్ రూప్ శంకర్ కోరారు. ఆదివారం హనుమకొండ అశోక కాలనీలోని గిరిజన భవన్‌లో ఉమ్మడి వరంగల్ జిల్లా బంజారా ఆత్మీయ సమ్మేళనం జరిగింది. ఈ సమ్మేళనంలో వారు పాల్గొని మాట్లాడుతూ గిరిజన ఉద్యమ నాయకుడు థానూ నాయక్ విగ్రహాన్ని హైదరాబాద్ ట్యాంక్ బండ్‌పై ఏర్పాటు చేయాలని, సేవాలాల్ మందిరాలను నిర్మించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. రిటైర్డ్ సోషల్ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ చందులాల్ మాట్లాడుతూ 12 ఏళ్లుగా బంజారా గోత్రాల క్యాలెండర్ ముద్రించి ప్రతి తండాకు చేరవేస్తూ బంజారాల సంక్షేమానికి కృషి చేస్తున్న బంజారా వెల్ఫేర్ అసోసియేషన్ కృషిని అభినందించారు. బంజారా వెల్ఫేర్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు వీఎన్ నాయక్ మాట్లాడుతూ గిరిజనుల సమస్యలను పాలకులు, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తూ పరిష్కారానికి కృషి చేస్తున్నామన్నారు. అనంతరం బంజారా క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో కొడకండ్ల జెడ్పీటీసీ కేలోత్ సత్యవతి, బంజారా వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ధారావత్ గిరిమోజీ, నాయకులు ధనుంజయ్, రవీందర్ నాయక్, బానోత్ వెంకన్న, హర్షిత, నరసింహనాయక్, సజ్జన్ నాయక్, జవహర్‌లాల్, సాంబయ్య నాయక్, నంద నాయక్, శ్యామ్‌లాల్ నాయక్ పాల్గొన్నారు.

# పోలీసుల అదుపులో గంజాయి స్మగ్లర్లు?

**హసన్‌పర్తి:** నలుగురు గంజాయి స్మగ్లర్లను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. హుజూరాబాద్, జమ్మికుంట డివిజన్ ప్రాంతానికి చెందిన నలుగురు వ్యక్తులు వివిధ ప్రాంతాలకు గంజాయి చేస్తున్న క్రమంలో పోలీసులకు చిక్కినట్లు సమాచారం. వారి వద్ద పెద్ద ఎత్తున గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. ప్రస్తుతం పోలీసులు విచారిస్తున్నట్లు సమాచారం.

### కుక్కల దాడిలో ఇద్దరు బాలురకు గాయాలు


తీవ్రంగా గాయపడిన అక్బర్

**వరంగల్:** వరంగల్ 21వ డివిజన్ ఎల్బీనగర్ భారత్ గ్యాస్ ఆఫీస్ సమీపంలో ఆదివారం ఉదయం వీధి కుక్కలు దాడి చేయడంతో అలీ అక్బర్, అనస్ అనే ఇద్దరు బాలురలకు తీవ్ర గాయాలయ్యాయి. వీధి వెంట వెళ్తున్న బాలురలపై కుక్కలు ఒకేసారి దాడికి పాల్పడ్డాయి. దీంతో అక్బర్ తల మీద, అనస్ చేతుల మీద గాట్లు పడ్డాయి. తీవ్ర గాయాలపాలైన ఇద్దరిని చికిత్స నిమిత్తం ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు. కాగా, డివిజన్‌లో ఇప్పటికే పలుమార్లు వీధి కుక్కలు పిల్లలపై దాడులు చేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని కాలనీ వాసులు ఆరోపిస్తున్నారు.

**కుక్కల దాడిపై మంత్రి సురేఖ విచారం..**

**వరంగల్ అర్బన్ :** గ్రేటర్ వరంగల్‌లోని 21వ డివిజన్ ఎల్బీనగర్‌లో ఇద్దరు పిల్లలపై కుక్కలు దాడి చేయడంపై రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ విచారణ వ్యక్తం చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని ఆదివారం సాయంత్రం బల్దియా కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషాను ఆదేశించారు. నగరంలో కుక్కలను నియంత్రించడానికి శాస్త్ర చికిత్సలు చేయాలని పేర్కొన్నారు.

# స్మార్ట్‌ఫోన్లకు దాసోహం..

**యువతలో నశిస్తున్న జ్ఞాపక శక్తి**
- సృజనాత్మకతపై తీవ్ర ప్రభావం
- మితిమీరక ముందే మేల్కోవాలి



**ఖిలా వరంగల్:** స్మార్ట్ ఫోన్.. ప్రస్తుతం నిత్యావసరమైంది. పిల్లల నుంచి మొదలు.. వృద్ధుల వరకు అందరి చేతుల్లో అతుక్కుపోయిన వస్తువు. ఉదయం లేచి మొదలు.. రాత్రి నిద్రించే వరకు సెల్ ఫోన్ లేనిదే రోజు గడవదంటే అతియోశక్తి కాదేమో. ముఖ్యంగా యువత ఫోన్‌లోనే కాలం వెళ్లదీస్తోంది. ఫలితంగా వారిలో శక్తి సామార్థ్యాలు తగ్గుతున్నాయి. ప్రతి విషయానికి ఇంటర్‌నెట్ వినియోగం పెరగడంతో జ్ఞాపక శక్తి నశిస్తోంది. ఫలితంగా నిజ జీవితంలో ఎదురయ్యే సమస్యలు ఎలా పరిష్కరించుకోవాలో తెలుసుకోలేకపోతున్నారు. బాహ్య ప్రపంచంతో సంబంధాలు కోల్పోతున్నారు. పురుషులు మూడు నిమిషాలకు మించి, మహిళలు ఐదు నిమిషాలకు మించి ఫోన్లను చూడకుండా ఉండలేకపోతున్నారని పలువురు మేధావులు చెబుతున్నారు.

**మెదడుకు పని తగ్గిస్తున్న స్మార్ట్ ఫోన్లు..**

స్మార్ట్ ఫోన్లు మెదడుకు పనిని తగ్గిస్తున్నాయి. మనిషి ఆలోచనా శక్తిపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. జ్ఞాపక శక్తిని నశింపజేస్తోంది. చాలా మంది మెదళ్లకు తాళం వేసింది. నాడు పదుల సంఖ్యలో ఫోన్ నంబర్లను గుర్తించుకున్న వారు ప్రస్తుతం తమ నంబర్ కూడా చెప్పలేకపోతున్నారు. చిన్న కూడికలను కూడా ఫోన్ లేనిదే చేయలేకపోతున్నారు. సృజనాత్మకత కోల్పోవడంతో పాటు తమకున్న భావావేశాన్ని ఇతరుల ఎదుట ప్రదర్శించలేకపోతున్నారు. పలు విషయాలు, పనులను ఎక్కడ మరిచిపోతామోనని అందరు ఫోన్ రిమైండ్‌లో పెట్టుకుంటున్నారు. పుట్టిన రోజు , పెళ్లిరోజు శుభాకాంక్షలు చెప్పాలంటే ఫోన్లు గుర్తు చేస్తే కానీ చెప్పలేని పరిస్థితి రావడం గమనార్హం .

**అన్నింటికీ ఫోన్లే ఆధారం**

ప్రతి విషయానికి **స్మార్ట్ ఫోన్‌**ను వినియోగించడం వల్ల యువతలో ఆలోచన శక్తి నశిస్తోందని పలు అధ్యాయనాలు చెబుతున్నాయి. కుటుంబ సభ్యులతో మాట్లాడితే సమాచారం తెలిసే విషయాల్లోనూ నెట్‌ను వాడుతున్నారని, ఇది భవిష్యత్తులో ప్రభావం చూపుతుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. నిరంతరం ఫోన్‌నే చూస్తూ కూర్చుంటే బాహ్య ప్రపంచంతో సంబంధం లేకుండా మానసిక పరిస్థితి నానాటికి దిగజారిపోతుందని అంటున్నారు. గురువులు, పెద్దలను అడిగి తెలుసుకోవడం వల్ల పుస్తకాలు, పేపర్లను చదవడం వల్ల సంపాదించిన జ్ఞానం వేరని, స్మార్ట్ ఫోన్ల ద్వారా వచ్చే జ్ఞానం వేరని స్పష్టం చేస్తున్నారు. ఇంటర్‌నెట్‌ను అదే పనిగా వినియోగిస్తే నిజ జీవితంలో ఎదురయ్యే సమస్యలను ఎలా ఎదుర్కోవాలో తెలియదని నిపుణులు చెబుతున్నారు.

**సృజనాత్మకతను దెబ్బతీస్తుంది.**



సెల్‌ఫోన్ ఎక్కువగా ఉపయోగించడం వల్ల జ్ఞాపక శక్తి, కంటి చూపు సమస్యలు ఉత్పన్నమవుతాయి. కళాశాలల్లో విద్యార్థులకు ఇచ్చే ప్రాజెక్ట్ వర్క్స్ అసైన్‌మెంట్స్ చేయలేకపోతున్నారు. కొంత మంది విద్యార్థులు ఇంటర్‌నెట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకుని మమ అనిపించేస్తున్నారు. మరింత కొంత మంది విద్యార్థులు స్వతహాగా చిన్నలెక్క కూడా చేయలేని పరిస్థితి. విద్యార్థి దశలో సెల్ వినియోగాన్ని తగ్గిస్తే ఆలోచన శక్తి పెరుగుతుంది.

-డాక్టర్ నరేష్‌కుమార్ ఫోర్ట్ వరంగల్

# పేదరిక నిర్మూలనే కేంద్ర ప్రభుత్వ లక్ష్యం

- వికసిత్ భారత్ సంకల్పయాత్రలో కేంద్ర మంత్రి ఆర్‌కే సింగ్



'వికసిత్ భారత్' ప్రతిజ్ఞ చేస్తున్న కేంద్ర మంత్రి , జిల్లా అధికారులు

**జనగామ రూరల్:** పేదరిక నిర్మూలనే కేంద్ర ప్రభుత్వ అంతిమ లక్ష్యం.. క్షేత్ర స్థాయిలో సంక్షేమ పథకాలు చేరవేసేందుకే వికసిత్ భారత్ సంకల్పయాత్ర చేపడుతున్నామని కేంద్ర విద్యుత్‌శాఖ మంత్రి రాజ్ కుమార్‌సింగ్ అన్నారు. ఆదివారం జనగామ మండలం పెంబర్తిలో సర్పంచ్ అంబాల ఆంజనేయులు అధ్యక్షతన నిర్వహించిన వికసిత్ భారత్ సంకల్పయాత్ర కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం అట్టడుగు వర్గాల ప్రజలకు 3కోట్ల ఇళ్లు నిర్మించిందని, గడిచిన కాలంలో 2కోట్ల 30 లక్షల విద్యుత్ కనెక్షన్లు ఇచ్చినట్లు చెప్పారు. ఉజ్వల పథకంతో ఉచిత గ్యాస్ కనెక్షన్ అందించామని, స్వయం ఉపాధి కింద పేదలకు షరతులు లేకుండా ముద్ర రుణాలు అందజేస్తున్నట్లు వివరించారు. పీఎం స్వనిధి యోజన ద్వారా చిరువ్యారులకు రుణాలు అందించిన ఘనత ప్రధాని మోదీకే దక్కుతుందన్నారు. అనంతరం పెంబర్తి గ్రామంలోని దివ్య జ్యోతి, మహాలక్ష్మి స్వయం సహాయక బృందాల మహిళలకు యూనియన్ బ్యాంక్ రూ.3కోట్ల రుణాలు, ఎస్‌బీఐ ద్వారా రూ.2కోట్ల 50 లక్షల చెక్కలను అందజేశారు. కేంద్ర సమాచార ప్రసార మంత్రిత్వ శాఖ రూపొందించిన క్యాలెండర్ ఆవిష్కరించారు. అనంతరం ప్రజలతో వికసిత్ భారత్ సంకల్పయాత్ర ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో కలెక్టర్ శివలింగయ్య, అదనపు కలెక్టర్ పింకేష్ కుమార్, యూబీఐ డీజీఎం సత్యనారాయణ, యూబీఐ, ఏజీఎం ఎస్.శ్రీనివాస్, జనగామ మేనేజర్ చంద్రశేఖర్, కేంద్ర సమాచార అధికారి శ్రీధర్, ఎస్‌కేవై అధికారి అన్వేష్ తదితరులు పాల్గొన్నారు.

# బాధితురాలికి బంగారం అప్పగింత


కాంతమ్మకు బంగారం, సెల్ ఫోన్ అప్పగిస్తున్న ఎస్సైలు

**మహబూబాబాద్ రూరల్ :** ఓ మహిళ బస్సులో పోగొట్టుకున్న బంగారం, సెల్ ఫోన్‌ను పోలీసులు కనుగొని ఆదివారం మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో ఆమెకు అప్పగించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లందు మండలం ముకుందాపురం గ్రామానికి చెందిన గులగట్టు కాంతమ్మ ఆర్టీసీ బస్సులో మహబూబాబాద్‌కు బయలుదేరి జిల్లా కేంద్రంలోని ఫారెస్ట్ కార్యాలయ సెంటర్‌లో దిగి వెళ్లిపోయింది. అయితే తన సెల్ ఫోన్, బంగారం ఉన్న కవర్‌ను బస్సులో మరిచిపోయింది. వెంటనే మహబూబాబాద్ టౌన్ పోలీసులకు సమాచారం ఇవ్వగా ఐడీ పార్టీ కానిస్టేబుళ్లు రమేష్ చంద్ర, గౌతమ్ వెంటనే బస్టాండ్‌కు వెళ్లి జరిగిన ఘటనపై ఆరా తీశారు. అప్పటికే అదే బస్సు నుంచి దిగి వెళ్లిన ఓ మహిళకు బంగారం, సెల్ ఫోన్ దొరకగా వాటిని స్వాధీనం చేసుకుని పోలీస్ స్టేషన్‌కు తీసుకొచ్చారు. అనంతరం బాధితురాలు కాంతమ్మను పిలిపించి టౌన్ ఎస్సైలు రామారావు, పవన్ కుమార్, శివ సమక్షంలో బంగారం, సెల్ ఫోన్ అప్పగించారు. కాగా, ఐడీ పార్టీ కానిస్టేబుళ్లు గౌతమ్, రమేష్ చంద్రను పోలీసులు, స్థానికులు అభినందించారు.

# క్రీడలతో స్నేహభావం

- సెంట్రల్ జోన్ డీసీపీ బారి


హైదరాబాద్ జట్టుకు మొదటి బహుమతి అందజేస్తున్న డీసీపీ బారి

**చిల్పూరు :** క్రీడలతో స్నేహభావం పెంపొందుతుందని సెంట్రల్ జోన్ డీసీపీ బారి అన్నారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్, ఏఆర్–టీఎస్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం మండలంలోని వంగాలపల్లిలో 2009 బ్యాచ్‌కు చెందిన సీఐ, ఎస్సైల ఒక రోజు ఫ్రెండ్లీ క్రికెట్ పోటీలు నిర్వహించారు. ఈపోటీల్లో వరంగల్ రౌండ్–1 కెప్టెన్ రవీందర్, హైదరాబాద్ హంటర్ 2– కెప్టెన్లుగా శ్రీనివాస్, మహేష్, రఘు వ్యవహరించారు. సాయంత్రం ముగింపు కార్యక్రమానికి సెంట్రల్ జోన్ డీసీపీ బారి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్యాచ్‌గా ఏర్పడి స్నేహపూర్వక వాతావరణంలో క్రికెట్ పోటీలు నిర్వహించుకోవడం అభినందనీయమన్నారు. అనంతరం పోటీల్లో గెలుపొందిన హైదరాబాద్, రన్నరప్ వరంగల్ జట్లకు బహుమతులు అందజేశారు. సమావేశంలో సీఐ, ఎస్సైలు ఎడవెల్లి శ్రీనివాస్‌రెడ్డి, హరిబాబు, నాగరాజు, రవిరాజ్, ఫణీందర్, వెంకటేశ్వర్లు, సతీష్, విశ్వేశ్వర్, లతీఫ్, వినయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## సాక్షి క్లాసిఫైడ్స్

**REAL ESTATE**

**KUDA PLOTS FOR SALE**

- Hanamkonda సిటీకి అతి దగ్గరలో తక్షణమే నిర్మాణం చేపట్టే KUDA Plots అమ్మబడును. T. రవి. సంప్ర॥ సెల్: 9533398666. [WA-7269]

**SERVICES**

**సెప్టిక్ ట్యాంక్ క్లీనర్**

- మీయొక్క సెప్టిక్ ట్యాంక్స్ నిండినవా? నూతన సాంకేతిక పరిజ్ఞానంతో గల్పర్ మిషన్ ద్వారా మీ సెప్టిక్ ట్యాంక్స్ క్లీన్ చేయబడును. సంప్ర॥ డి.యస్. రావు, సెల్: 9849145043. [W-788980]

**WANTED**

- వరంగల్ నగరంలోని వాషింగ్ మిషన్ సర్వీస్ సెంటర్ యందు టెలికాలర్ (ఆఫీస్ అసిస్టెంట్) స్త్రీలు కావలెను. జీ: రూ. 8000/–లు+ ఇన్‌సెంటీవ్స్ ఇవ్వబడును. Time: 10am to 5pm. Cell: 8179585395 [W-1229395]
- వరంగల్, హన్మకొండ లోకల్‌లో పని చేయుటకు సెక్యూరిటీ గార్డ్స్ & సూపర్‌వైజర్స్ అర్జెంటుగా కావలెను. జీతం: 13,000 – 16,000. సంప్ర: 9000463426. [W-1220888]
- మీ ఇంటి వద్దనే వుండి మీ మొబైల్ ద్వారా మా కంపెనీ యొక్క Message పంపుతూ వారానికి 3500/- సంపాదించుకోండి. వాట్సాప్ చేయండి. సంప్ర. 9573633520, 9059633520. [M-1167505]
- Hydలో పనిచేయుటకు సె॥గార్డ్స్, సె॥సూపర్ వైజర్స్ లేడీ గార్డ్స్, ఫీల్డ్ ఆఫీసర్స్, కావలెను. ఏరియా: బాలానగర్, మియాపూర్, జీడిమెట్ల, గండిమైసమ్మ కొల్లూరు రూం ఫ్రీ మెట్రో మేనేజ్‌మెంట్ ఫోన్: 9963077722/ 9885657755 [H-801465]
- హరేకృష్ణ హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఫ్రీ వసతి+ భోజనం. జీ : 18K. Ph: 9640258899, 9640468899 [H-793680]
- మీ ఇంటి వద్దనే వుండి మీ మొబైల్ ద్వారా యాడ్స్ పంపిస్తూ వారానికి 3500/– సంపాదించుకోండి. వాట్సాప్ చేయండి. 7702518530, 8019341329. [M-1233755]

4 లైన్ల క్లాసిఫైడ్ ప్రకటన 260/- రూ॥ అదనపు లైను 60/- రూ॥ మాత్రమే 5% GST అదనము

**ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి**

హన్మకొండ : 9010144453
వరంగల్ : 9705748198
నర్సంపేట : 9553955722
జనగామ : 9951602871
మహబూబాబాద్ : 9010144453
పరకాల : 9010299096
జయశంకర్ భూపాలపల్లి : 9705748198

**గమనిక**

సాక్షి తెలుగు దినపత్రికలో రోజు ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.